

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.146	210	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 , కనిష్ఠం 24.0

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న రాజకీయ వేడి
- కరువుపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- మంత్రులు, మాజీ మంత్రుల నడుమ పరస్పర ఆరోపణల యుద్ధం



మాటల మంటలు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ నాయకులు మాటల మంటలు రేపుతున్నారు. కరువుకు బాధ్యత మీదంటే మీదేనంటూ ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. అటు మంత్రులు, ఇటు ప్రతిపక్ష నేతల మాటలతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మాజీ సీఎం కేసీఆర్ పర్యటన, ఆ వెంటనే మాజీ మంత్రి కేటీఆర్ జిల్లాకు రావడంతో బీఆర్ఎస్ నుంచి మొదలైన విమర్శలపై మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమారెడ్డిలతో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ప్రతిస్పదించారు. సాగర్‌లో నీటి నిల్వల నుంచి మొదలు ఫోన్‌ట్యాపింగ్ వరకు ప్రతీ అంశంపై ధీటుగా ఆరోపణ, ప్రత్యారోపణలకు దిగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు మరింత దగ్గరయ్యే నాటికి మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది.

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల ప్రచారం షురూ అవడంతో జిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. జిల్లాపైనే ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ దృష్టి సారించడంతో జిల్లాకు చెందిన ఇరు పార్టీల నేతల నడుమ మాటల యుద్ధం సాగుతోంది. జిల్లాలో ఎండిన పంట పొలాలను ఆదివారం పరిశీలించిన మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై సీరియస్‌గా విమర్శలు చేస్తే, సోమవారం జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకడుగు ముందుకేసి తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

మంత్రులు, మాజీల నడుమ మాటల తూటాలు

మరోవైపు విద్యుత్ కోతలపైనా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి, మాజీ మంత్రి కేటీఆర్‌కు మధ్య మాటల యుద్ధం సాగింది. కరెంటు కోతలు లేవని, ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే ఈ కట్టుకథలు అల్లుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అంటే, మంత్రి ఉత్తమ్ బుకాయిస్తున్నారని, కానీ కోతల్లేవని రైతుల వద్దకు వచ్చి చెప్పగలరా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. తన ఫోన్‌ని కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందని తాజాగా మంత్రి ఉత్తమ్ పేర్కొనడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో బాధితులు ఇంకా ఎవరెవరు బయటకు వస్తారోననే ఆసక్తి నెలకొంది. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి నడుమ తీవ్రస్థాయిలో ఆరోపణలు కొనసాగుతున్నాయి. తమ ప్రభుత్వ హ యాంలో సాగర్ నీళ్ల చివరి ఆయకట్టు వరకు ఇప్పించామని, దిగువకు నీళ్ల వెళ్తున్న సమయాల్లోనూ జిల్లా రైతాంగానికి సాగు నీరిప్పించామని, ఇప్పుడు కాల్వ కట్టలమీద పోలీసు బందోబస్తుతో దిగువకు నీళ్ల తీసుకెళ్తుంటే మంత్రి కోమటిరెడ్డి ఎందుకు కాల్వల మీదకు రావడం లేద ని మాజీమంత్రి జగదీష్‌రెడ్డి నిలదీశారు. రైస్‌మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నందునే ధాన్యానికి ధరలు తగ్గించినా మిల్లర్లపై చర్యలు తీసుకోలేకపోతున్నార ని ఆరోపించారు. మాజీమంత్రి జగదీష్‌రెడ్డి గతప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని, విద్యుత్ మంత్రిగా దోపిడీకి పాల్పడ్డారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపణలు గుప్పిస్తుంటే, మరోవైపు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సైతం జగదీష్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. మొత్తంగా ప్రజాసమస్యలు, కరువు, విద్యుత్ కోతలు, అవినీతి అంశాలపై రెండుపార్టీల నడుమ, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే ల నడుమ సాగుతున్న మాటల యుద్ధం లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చేసరికి ఇంకా ఏ స్థాయికి చేరుతుందోనని, ఇంకా ఏస్థాయి ఆరోపణలు వినిపిస్తాయోనని రాజకీయవర్గాల్లో చర్చ మొదలైంది.

కరువుకు మీరే బాధ్యులంటే మీరే బాధ్యులని ఆరోపణలు

ఉమ్మడిజిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో పంటలు ఎండిపోయి రైతాంగం నష్టపోవడానికి మీరంటే మీరే కారణమని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. ఆదివారం జిల్లాలో పర్యటించిన మాజీ సీఎం కేసీఆర్ ఈ కరువు కాంగ్రెస్ అసమర్థత వల్లే వచ్చిందని దుయ్యబట్టారు. ఇటు నాగార్జునసాగర్‌లో, అటు కాళేశ్వరంలో నీళ్లున్నా తెలివితక్కువతనంతో, అవగాహన రాహిత్యంతో నీళ్లివ్వకపోవడం వల్లే కరువు ప్రబలిందని ఆరోపించారు. పంటనష్టానికి కాంగ్రెస్‌దే బాధ్యతని, పంటనష్టం ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ వెంటపడతామని హెచ్చరించారు. అయితే కరువుకు గత కేసీఆర్ ప్రభుత్వ పాలనే కారణమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఆయన చేసిన పాపాలు, అన్యాయాల వల్లే ఈ దుస్థితి దాపురించిందని, గత పదేళ్లలో రాయి, రప్ప, ఇసుక దేన్నీ వదలకుండా దోచుకున్నారన్నారు. కేఆర్ఎంబీ సాకుతో సాగర్‌లో 14 టీఎంసీల నీరు తీసుకునే అవకాశమున్నా తీసుకోలేకపోయారని, ఇది ఈ ప్రభుత్వ అసమర్థతని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తుంటే, కేఆర్ఎంబీకి ప్రాజెక్టుని అప్పగించేందుకు అంగీకరించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రులు ఆరోపిస్తున్నారు.



అసమర్థ కాంగ్రెస్

ప్రభుత్వంతోనే కరువు

- మాజీ మంత్రి కేటీఆర్

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పంటలు ఎండిపోయాయని, తాగునీరు కూడా దొరకడం లేదని, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సోమవారం నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామంలో రైతులు గన్నెబోయిన మల్లయ్య, బోర్ల రాంరెడ్డిలను కలిసి కరువు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆ నాటి తెలంగాణ రైతుల దుస్థితికి అవస్థలకు బోర్ల రాంరెడ్డి చిహ్నంగా నిలిచారని ఆయన ధీన పరిస్థితిని కేసీఆర్ 100సార్లు చెప్పారని గుర్తుచేశారు. రాంరెడ్డి పేరు బోర్ల రాంరెడ్డిగా మారిందన్నారు. కేసీఆర్ పర్యటనతో భయపడిన ప్రభుత్వం నంది పంప్‌హౌజ్‌లో నీళ్ల ఎత్తిపోసి కరీంనగర్‌కు నీళ్ల వదిలిందన్నారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు సాగర్ నుంచి టెయిల్‌పాండ్ దాకా సాగునీరు అందిందన్నారు. ఇప్పటివరకు సీఎంతో పాటు మంత్రులు రైతులను పరామర్శించ లేదన్నారు. ప్రధానప్రతిపక్షంగా కేసీఆర్ తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా జిల్లాలో పర్యటించి రైతులకు ధైర్యం చెబుతున్నాడన్నారు. వీడియోలో రైతు మల్లయ్య కష్టాలను చూసి చలించిపోయి ముశంపల్లి గ్రామానికి వచ్చానన్నారు. ఈ సందర్భంగా రైతు మల్లయ్య కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు.

రెట్టింపు ఉత్సాహంతో పోరాడాలి : కేటీఆర్

గత ఎన్నికల్లో ఓటమితో బాధపడకుండా నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినా తాము ప్రచారం చేసుకోలేకపోయామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పేలా నల్లగొండ ఎంపీ స్థానాన్ని గెలుస్తామన్నారు.

ప్రజలు నిలదీస్తారనే కాంగ్రెస్ దొంగ డ్రామాలు: మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుతాన్ని ప్రజలు నిలదీస్తారనే భయంతోనే ఆ కేసులు, ఈ కేసులు అంటూ దొంగ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సోయిలేదని అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ కేసులు పెట్టడమే కాంగ్రెస్‌కు అలవాటు అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 110రోజుల సమయం ఇచ్చినా పాలనలో మార్పు రాకపోవడంతో మాజీ సీఎం కేసీఆర్ రైతులను ఓదార్చేందుకు వచ్చారన్నారు.

రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రభుత్వం: ఎంపీ బడుగుల



రాష్ట్రాన్ని దుర్మార్గమైన ప్రభుత్వం పాలిస్తుందని ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని ప్రజలు అనుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తిరుగుడే సరిపోయిదని, ప్రజా సమస్యలు ఆయనకు పట్టడం లేదన్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతారని ఆయన ఎప్పుడు ఏంమాట్లాడుతారో ఆయనకే తెలియదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శరణ్యమని పేర్కొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇస్తే పార్లమెంట్‌లో పోరాడుతా



తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలోని సమస్యలపై పార్లమెంటులో పోరాటం చేస్తానని నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. 2014 ముందు తెలంగాణ ప్రాంతం అన్నిరంగాల్లో వెనుకబడి ఉండేదని, సీఎం కేసీఆర్ సీఎం అయిన తర్వాత రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. కేసీఆర్ మాదిరిగానే తనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టమని రైతుల కష్టాలను తాను దగ్గర ఉండి చూశానన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందడంతో చత్తీస్‌ఘడ్ నుంచి కూలీలు వచ్చి ఇక్కడ నాట్లు వేస్తున్నారని తెలిపారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి



నిడమనూరులో ఎన్నికల సిబ్బందికి శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిడమనూరు, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది కృషి చేయాలని అదనపు కలెక్టర్, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో నాగార్జునసాగర్ అసెంబ్లీ పరిధిలోని ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఎన్నికల నిర్వహణపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందజేశారు. సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఈసారి స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వడం జరిగిందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిడమనూరు, హాలియా, తిరుమలగిరిసాగర్, గుర్రంపోడ్ మండలాల తహసీల్దార్లు జంగాల కృష్ణయ్య, జయశ్రీ, యాదగిరి, కిరణ్, ఎంఈవో తరి రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే చర్యలు: ఎస్పీ



బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ

నల్లగొండటౌన్,ఏప్రిల్ 1 : ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన దాదాపు 25మంది అర్జీదారులతో మాట్లాడి సమస్యల తీసుకున్నారు. అర్జీలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలీసు పరిధిలోని ప్రతీ అంశాన్ని చట్టపరిధిలో పరిష్కరించడంలో,బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బాధితులకు న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించినా, మహిళలకూ వ్యతిరేకంగా జరిగేనేరాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

నాటక పోటీల నిర్వహణ హర్షనీయం




జీవనయానం సాంఘిక నాటికలోని దృశ్యం

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 1 : జాతీయస్థాయి నాటక పోటీలను పట్టణంలో నిర్వహించడం హర్షనీయమని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక కళాకేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి పద్య, సాంఘిక నాటక పోటీల్లో మూడో రోజు కార్యక్రమాలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నాటకరంగంపై అభిమానంతో కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళాకారులు పోటీపడుతూ ఆయా పాత్రలకు జీవం పోస్తున్నారన్నారు. కాగా ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన రక్తపాశం, మైరావణ పద్యనాటికలు రక్తి కట్టించాయి. నాలోన నీవే, జీవనయానం సాంఘిక నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో కళాకేంద్ర వ్యవస్థాపకుడు తడకమళ్ల పూర్ణచందర్, అధ్యక్షుడు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి, పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, సాయిలు, పరిమి రామావతారం, ఉపేందర్, పయ్యావుల శ్రీనివాసరావు, రాంరంగారావు, బాబురావు, రాఘవయ్య, బాపనయ్య, వేణు, వెంకటరెడ్డి, రఘు పాల్గొన్నారు.

నేరస్థులపై నజర్

- నేరాలకు పాల్పడితే జైలుకే
- తహసీల్దార్ల ఎదుట రౌడీషీటర్ల బైండోవర్




నల్లగొండ/నల్లగొండ టౌన్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న రౌడీ షీటర్లపై ప్రత్యేక నజర్ పెట్టారు. ఎన్నికల సందర్భంలో ఆయా గ్రామాల్లో రౌడీ షీటర్లు, పాతనేరస్థులు అల్లర్లు సృష్టించేందుకు, ప్రజలను ఇబ్బందులకు గురి చేయనున్నారనే ఆలోచనతో పోలీస్ శాఖ ముందస్తుగా వారిపై కన్నేసి, వారి కార్యకలాపాలపై దృష్టి సారించింది. పోలీస్ స్టేషన్లవారీగా రౌడీ షీటర్ల, పాతనేరస్థుల వివరాలు సేకరించి ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే వారిని బైండోవర్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 5,936 మంది పాతనేరస్తులు, రౌడీషీటర్లను పోలీస్‌శాఖ గుర్తించింది. వారిని ఇప్పటికే ఆయా స్టేషన్ల పరిధిలో ఎస్‌హెచ్‌వోలు పిలిపించి మందలించడంతోపాటు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, పాతనేరస్థులను పిలిపించి స్థానిక తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు సొంత పూచీకత్తుపైనే వారిని బైండోవర్ చేసి వదిలేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5,936 మంది పాత నేరస్థులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ మొత్తం 5,936 మంది పాత నేరస్థులను గుర్తించింది. ఇందులో సూర్యాపేట జిల్లాలో 4100, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1571 మంది, నల్లగొండ జిల్లాలో 265 మంది పాత నేరస్థులు, రౌడీషీటర్లు ఉన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని రౌడీ షీటర్లపై గట్టి నిఘాపెట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై నిఘా



జిల్లావ్యాప్తంగా రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. హత్యలు, దందాలు, బెదిరింపులు, అక్రమ వ్యాపారాలు ఇతర నేరాలకు పాల్పడే వారిపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. రౌడీ షీటర్లుగా ఉన్న వారు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారి వివరాలను కూడా సేకరించి వారిని స్థానిక పీఎస్‌లకు పిలిపించి కౌన్సిలిం గ్ నిర్వహిస్తున్నారు. తాజాగా వీరు దిగిన ఫొటోలతోపాటు నమోదైన కేసులు, శిక్షలు కూడా పోలీసులు రికార్డు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రౌడీ షీటర్లు ఏఏ పనులు చేస్తున్నారో వారి జీవన విధానంతోపాటు వారి ప్రవర్తన, కుటుంబ పరిస్థితులను కూడా సేకరిస్తున్నారు. రౌడీ షీటర్లుగా ఉన్న వారు కొంత మంది ప్రస్తుతం నేర వృత్తిని వదిలి కుటుంబంతో గడుపుతూ వ్యాపారాలు చేసుకుంటున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు సమాచారం.

జిల్లా వ్యాప్తంగా బైండోవర్లు

పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో జిల్లా యంత్రాంగం పాత నేరస్థులు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిని బైండోవర్ చేస్తున్నారు. బైండోవర్ అయిన అనంతరం నేరాలకు పాల్పడితే వారికి రూ.లక్ష జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేయనున్నారు. రూ.లక్ష జరిమానా కట్టకపోతే ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ పాత నేరస్థులపై గట్టినిఘా ఏర్పాటు చేసింది. జిల్లావ్యాప్తంగా రౌడీ షీటర్లతో పాటు గడిచిన ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిని సైతం గుర్తించి బైండోవర్ చేస్తున్నారు. ఏదేమైనా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల మేరకు శాంతి భద్రతలకు విఘాతం పాల్పడే అవకాశమున్న పాత నేరస్థులు, రౌడీ షీటర్ల గత ఎన్నికల్లో గొడవలకు సంబంధం ఉన్న వారిపై నిఘా ఏర్పాటుచేస్తూ జిల్లాలో ఇప్పటివరకు 155 కేసుల్లో 265 మందిని సంబంధిత ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేశాం. ప్రజలంతా తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించేలా పనిచేస్తున్నాం. ఎవరైనా బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

చందనా దీప్తి, ఎస్పీ, నల్లగొండ

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 1 : విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి సైదులు అన్నారు. సోమవారం ఆయన సాగర్ హిల్ కాలనీలో బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల్లో అన్ని తరగతులు తిరిగి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను తాను స్వయంగా కొన్ని అంశాల గురించి అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం వసతి గృహంలో భోజనశాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డిగ్రీ కళాశాల విద్యార్థుల హాజరుశాతం అతి తక్కువగా ఉన్నందున హాజరుశాతం పెంచాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట నల్లగొండ ఆర్‌సీవో షకీనాబాను, పాఠశాల ప్రిన్సిపాల్ రజినీకాంత్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రాచారి, విశ్రాంత ప్రిన్సిపాల్స్ భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, శివాజీ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి సైదులు

గర్భిణులకు అల్ట్రా

స్కానింగ్ పరీక్షే

- స్కానింగ్ చేసేందుకు 10రోజుల వాయిదాలు

7లో

బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరల పెంపు

మాడ్గులపల్లిలో 43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

తాగునీటి ఎద్దడి నివారణకు అన్నిచర్యలు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 1 : జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వివరించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో తాగునీరు, యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లాకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఇదివరకే వేసవి కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, ప్రజలు తాగునీటి ఇబ్బందికి గురికాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నల్లగొండ మునిసిపాలిటీపై ప్రత్యేక శ్రద్ధ వహించామని, ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు ఇంకా తాగునీటి సరఫరా ఉన్నందున పట్టణానికి సైతం తాగునీటికి ఇబ్బంది లేదని వివరించారు. అదేవిధంగా జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, అవసరమైన అన్ని ప్రాంతాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 370 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తామని ఆమె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పీ పూర్ణచందర్, రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి, పాల్గొన్న కలెక్టర్

హరిహరులకు విశేష పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామి వారికి, శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మ వార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉందని అధికారులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 41,93,233ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరిగుట్టలో సంప్రదాయ దుస్తుల పట్టింపేదీ?

ఆలయాల్లో ఆధ్యాత్మికత, భక్తిభావం వెల్లివిరిసేందుకు కొన్ని నిబంధనలు అమలుచేస్తారు. పుణ్యక్షేత్రాల్లో ఇవి పాటించడానికి భక్తులు కూడా సహకరిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానంలోనూ వీఐపీ బ్రేక్ దర్శనానికే కాకుండా సాధారణ దర్శనానికి కూడా డ్రెస్‌కోడ్‌ను భక్తులు తప్పనిసరిగా పాటించే నిబంధన ఉంది. యాదగిరిగుట్టలో నిత్యం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు బ్రేక్ దర్శనం ఉంటుంది. రూ.300 టికెట్ కొనుగోలుచేసి భక్తులు ఈ అవకాశం పొందే సౌకర్యం ఉంటుంది. ఈ టికెట్ ద్వారా 10ఏళ్లలోపు ఉన్న పిల్లలు మినహా భక్తులు నేరుగా అంతరాలయంలో స్వామిని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది. కొంతమంది భక్తులు వివిధ రకాల అధునిక(ఫ్యాషన్) దుస్తులతో ప్రధానాలయంలోకి వెళ్లి స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు. డ్రెస్‌కోడ్ అంశంపై ఈవో భాస్కర్‌రావు స్పందిస్తూ ఇప్పటికిప్పుడు మార్పులు చేయలేమని. ప్రభుత్వం, దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు అమలుచేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు

చివ్వెంల, ఏప్రిల్ 1: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని తిర్మలగిరి గ్రామ సీనియర్ పంచాయతీ కార్యదర్శి నూకల కోటిరెడ్డికి వల్లభాపురం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తిరుమలగిరి గ్రామంలో విధులు ముగించుకొని సూర్యాపేటకు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ సమీపంలో జాతీయరహదారి-65పై కోటిరెడ్డి ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటిరెడ్డికి తల, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

గర్భిణులకు అల్ట్రా స్కానింగ్ పరీక్షే


భువనగిరిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్



- దయాగ్నోస్టిక్ హబ్‌లో స్కానింగ్ కోసం పడిగాపులు
- స్కానింగ్ చేసేందుకు 10రోజుల వాయిదాలు
- ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న గర్భిణులు, రోగులు
- దయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేసినా అవస్థలే

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1: తల్లి గర్భంలో పెరుగుతున్న శిశువు ఆరోగ్యాన్ని వైద్యులు తెలుసుకునేందుకు ఏకైక మార్గం అల్ట్రాస్కానింగ్. అంతేకాక కడుపునొప్పితో బాధ పడేవారికి, రోడ్డు ప్రమాద బాధితులతో పాటు అవసరమైన వారందరికీ ఏ తరహా చికిత్స అందించాలో తెలుసుకునేందుకు అల్ట్రా స్కానింగ్ పరీక్ష చేస్తారు. బాధితులందరికీ ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు అందించేందుకు ఏడాది క్రితం భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేశారు. పలు రకాల రోగనిర్ధారణ పరీక్షలతో పాటు అల్ట్రా స్కానింగ్‌ను కూడా ప్రారంభించారు. మెజార్టీ పరీక్షల నిర్వాహణలో కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ అల్ట్రా స్కానింగ్ పరీక్షలు మాత్రం గర్భిణులతో పాటు అం దరికీ పరీక్ష పెడుతోంది. గర్భిణీకి 3వ, 7వ, 9వ నెలలో స్కానింగ్ చేసి పిండస్థ శిశువుతో పాటు తల్లి ఆరోగ్యా న్ని అంచనా వేస్తారు. దీంతో జిల్లా ఆస్పత్రిలోని టి హబ్‌కు ప్రతీ సోమవారం, గురువారం సుమారు 100 మందికి పైగా, సాధారణ రోజుల్లో సుమారు 25మంది గర్భిణులు, అదనంగా మరో 30 మంది వరకు రోగులు స్కానింగ్ కోసం వస్తుంటారు. వెంటనే స్కాన్ చేసి రిపోర్ట్ ఇవ్వాల్సిన బాధ్యత టి హబ్ నిర్వాహకులది. కానీ వెంటనే చేయాల్సిన స్కానింగ్‌కు 10రోజుల వాయిదా ఇస్తుండడం టి హబ్ నిర్వాహకులకు అలవాటుగా మారింది. విధిలేని పరిస్థితుల్లో పలువురు యథావిధిగా ప్రైవేట్ ల్యాబ్‌లనే ఆశ్రయిస్తున్నారు.

రోజుకు 45 మందికి

టీ హబ్ ప్రొటోకాల్ ప్రకారం అర్హులైన ఇద్దరు అల్ట్రాసౌండ్ స్కానింగ్ టెక్నిషియన్స్, వైద్యులు ఉండాలి. ప్రస్తుతం ఒకే ఒక్క టెక్నిషియన్ మాత్రమే ఉన్నాడు. దీంతో రోజు తప్పించి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 45మందికి మాత్రమే అల్ట్రా స్కానింగ్ తీస్తున్నారు. దీంతో స్కానింగ్ కోసం వచ్చే వారికి వాయిదా తేదీలను ఇవ్వాల్సి వస్తున్నదని అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం అన్ని పని దినాల్లో స్కానింగ్ చేసి వెంటనే రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించని సిబ్బంది స్కానింగ్ కోసం వచ్చే వారి ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది రోజుల వాయిదా తేదీ ఇచ్చారు



కడుపునొప్పితో సోమవారం భువనగిరి జిల్లా ఆస్పత్రికి వెళ్లా. ఓపీ డాక్టర్ స్కానింగ్ రాయడంతో టిహబ్‌కు వెళ్లాను. అక్కడ పెద్ద సంఖ్యలో గర్భిణులు స్కానింగ్ కోసం ఎదురుచూస్తుండగా స్కానింగ్ చేసే సిబ్బందే లేరు. పైగా గర్భిణులతో సిబ్బంది వాగ్వాదం చేస్తున్నారు. కడుపు నొప్పితో వెళ్లిన నన్ను స్కానింగ్ కోసం ఈ నెల 9న రావాలని వాయిదా తేదీ ఇచ్చారు. నేను గట్టిగా మాట్లాడడంతో అత్యవసరంగా టెక్నిషియన్‌ను పిలిపించి స్కానింగ్ పూర్తి చేశారు. ఈ తరహాలో టీ హబ్‌ను నిర్వహిస్తే రోగులు ఆర్థికంగా, ఆరోగ్యంగా నష్టపోయే పరిస్థితి.

- సుధాకర్, టేకుల సోమారం. వలిగొండ మండలం.

గర్భిణులందరికీ స్కానింగ్ చేస్తున్నాం



గర్భిణులందరికీ సక్రమంగానే స్కానింగ్ చేస్తున్నాం. అత్యవసరం కాని ఇతరులకు మాత్రమే వాయిదా తేదీల ను ఇస్తున్నాం. టీహబ్ నిర్వాహణలో పూర్తిస్థాయి నిబంధనలు పాటిస్తున్నాం. ఎవరికీ ఇబ్బం ది కలగకుండా సిబ్బంది సేవలు అందిస్తున్నారు. సిబ్బంది ఖాళీలతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ మే రకు పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకె ళ్లాం. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.

- డాక్టర్ చిన్నా నాయక్, భువనగిరి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్.

పెళ్లికి నిరాకరించాడని ప్రియురాలి ఆత్మహత్య


పావని(ఫైల్)

భువనగిరి టౌన్, ఏప్రిల్ 1: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి పట్టణ ఎస్ఐ అరుణ్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. భువనగి రిలోని కుమ్మరివాడలో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉండే రాంపల్లి పావని(24) తమ సమీప బంధువులైన నార్కట్‌పల్లి మండలం గోపాలపల్లి గ్రామానికి చెందిన మండల శ్రవణ్‌తో ప్రేమలో పడింది. ఇద్దరు చాలా రోజులుగా సన్నిహితంగా ఉంటు న్నారు. పావనిని పెళ్లి చేసుకోవాలని అడిగేందుకు ఆమె తల్లిదండ్రులు భూపాల్, పద్మ ఇటీవల శ్రవణ్ ఇంటికి వెళ్లారు. శ్రవణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు వారితో అసభ్యంగా మాట్లాడి పెళ్లికి నిరాకరిం చారు. దీంతో మనస్తాపానికి గురైన పావని ఇంట్లో ఆత్మహత్యా యత్నం చేయగా చికిత్స అనంతరం కోలుకుంది. శ్రవణ్ గత నెల 27వ తేదీన ఇంట్లో మోతాదుకు మించి నిద్రమాత్రలు మింగటంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పావని 28వ తేదీన విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 31వ తేదీ రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం సాయంత్రం మోటకొండూరు మండలం కదిరేనిగూడెం స్వగ్రామానికి తీసుకువెళ్లారు. పావని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మండల శ్రవణ్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ అరుణ్ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రవణ్ బయటకు వచ్చిన అనంతరం అరెస్టు చేస్తామని ఎస్ఐ అరుణ్ తెలిపారు.

మా డబ్బులు మాకివ్వండి

- సాగర్ పైలాన్ కాలనీలో పోస్ట్‌మాస్టర్ బాధితుల ధర్నా
- నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఘటన



పైలాన్‌కాలనీ పోస్టాఫీస్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 1: తాము జమ చేసుకున్న డబ్బులు మాకివ్వండి అని పోస్టాఫీస్ ఖాతాదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలోని పోస్టాఫీస్‌కు తాళం వేసి ధర్నా నిర్వహించారు. సాగర్ పైలాన్ కాలనీ పోస్టాఫీస్‌లో సబ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహించిన రామకృష్ణ ఖాతాదారులు దాచుకున్న సొమ్మును రూ.2కోట్లు సొంత ఖాతాలకు మళ్లించుకున్నాడు. గత ఏడాది డిసెంబర్ నెలలో గుర్తించిన ఖాతాదారులు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ నిర్వహించి సొంత ఖాతాలకు నగదు బదిలీ చేసుకున్నట్లు గుర్తించారు. అదే నెలలో రామకృష్ణ పోలీసులకు లొంగిపోగా, ప్రస్తుతం నల్లగొండ జిల్లా జైలులో ఉన్నాడు. ఈ సంఘటన జరిగి నాలుగు నెలలు అవుతున్నా తమకు నగదు రికవరీ చేయలేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పలువురు బాధితులు పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నగదు రికవరీ చేయించాలని పోస్టల్ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులు కూడా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ విషయమై దేవరకొండ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఖాతాదారుల నగదును సొంతంగా వాడుకోవడంపై విచారణ కొనసాగుతోందని, ఖాతాదారుల రికార్డుల నమోదు పూర్తయిందని తెలిపారు. సొమ్ము కాజేసిన సబ్ పోస్టుమాస్టర్ రామకృష్ణ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపించి త్వరలో ఖాతాదారులకు నగదు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంటసేపు తర్వాతపోస్టాఫీస్ తాళం తీయడంతో పోస్ట్‌మాస్టర్ రంగయ్య విధులు నిర్వర్తించారు.

మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన


పద్మారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు


పద్మారెడ్డి(ఫైల్)

భువనగిరి రూరల్, ఏప్రిల్ 1: పశువులు తన పొలంలో మేస్తున్నాయని రైతు సంబంధిత పశువుల యజమానులపై ఆగ్రహిం చాడు. దీంతో వారు గత నెల 19వ తేదీన రైతుపై కొడవలి, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రైతు చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వడపర్తి గ్రా మంలో జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భువనగిరి మండలం వడపర్తి గ్రామానికి చెందిన ఎలిమినేటి పద్మారెడ్డి(60) వ్యవసాయం పొలంలో అదే గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్యకు చెందిన గేదెలు గత నెల 19వ తేదీన గడ్డి మేస్తుండడంతో, వరి పొలాన్ని నష్టం చేస్తున్నాయని పద్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశాడు. దీంతో మేడబోయిన సత్తయ్య, అతని భార్య వీరమణి, కుమారులు బాల మల్లేష్, గోపి కృష్ణ పొలంలోనే పద్మారెడ్డిపై కొడవలి, కర్రలతో దాడి చేశారు. అడ్డువెళ్లిన పద్మారెడ్డి భార్య కమలమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డిలను కూడా గాయపర్చారు. వెంటనే వారందరినీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన సత్తయ్య, బాల మల్లేష్, గోపి కృష్ణలను మార్చి 26న అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. పద్మారెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పద్మారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురిపై హత్య కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వడపర్తి గ్రామంలో ఉద్రిక్తత

పద్మారెడ్డిపై దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బాధిత కుటుంబ సభ్యులు సత్తయ్య కుటుంబీకులు కొత్తగా నిర్మిస్తున్న ఇంటిలోపల మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ బాధితులను సముదాయించారు. దాడి చేసిన నలుగురు కుటుంబ సభ్యులపై హత్యా నేరం కేసు నమోదు చేశామని, ఈ నెల 26న మేడబోయిన సత్తయ్య, అతని కుమారులు బాలమల్లేష్, గోపి కృష్ణలను కోర్టులో రిమాండ్ చేశామని, సత్తయ్య భార్య వీరమణిపై కూడా కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తానని చెప్పారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం గ్రామంలో పద్మారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

రూ.90 లక్షల విలువైన బంగారం, వెండి పట్టివేత

- ఉమ్మడి జిల్లాలో రూ. 3.59లక్షల నగదు పట్టివేత


టేకుమట్ల చెక్‌పోస్టు వద్ద బంగారం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

సూర్యాపేటరూరల్, పెద్దఅడిశర్లపల్లి, దేవరకొండ, కోదాడ రూరల్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల చెక్ పోస్టు వద్ద సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ ఆధ్వర్యంలో సోమారం వాహనాల తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బొలేరో వాహనంలో 1,135 గ్రాముల బంగారం, 17కిలోల 99 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించారు. వీటి విలువ రూ. 90,31,038 ఉంటుందని పోలీసులు తెలిపారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రూ.2.39 లక్షల నగదు పట్టుకున్నట్లు చింతపల్లి ఎస్ఐ బి. యాదయ్య తెలిపారు. గుంటూరు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన చిత్రియాల సైదారావు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన ఎల్లబోయిన నాగరాజు నగదు తీసుకెళ్తుండగా అందుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి నల్లగొండలోని డీటీవో సేఫ్ కస్టడీకి పంపించినట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఆంధ్రా సరిహద్దు రామాపురం చెక్‌పోస్టు వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో రూ. 65 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కారులో నగదు తీసుకెళ్తుండగా నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో ఆ నగదును ఎన్నికల అధికారికి అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా అనంతగిరి మండలం శాంతినగర్ చెక్‌పోస్టు వద్ద ఖమ్మం నుంచి కోదాడకు కారులో వస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ. 55 వేల నగదును గుర్తించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

అన్ని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం : కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్): సూర్యాపేట జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, నగలు, సామాగ్రి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌లో ఆధారాలు చూపితే తిరిగి ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.1.17కోట్ల నగదు, 7,403 లీటర్ల మద్యం (విలువ రూ. 29.35లక్షలు)తోపాటు 10వాహనాలు (విలువ రూ. 2.32లక్షలు), బంగారం ఇతర ఆభరణాల విలువ రూ.23.32 లక్షలు, ఇతర వస్తువుల విలువ రూ.70.28లక్షలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం రూ.2.43కోట్లు లక్షలు విలువ ఉంటాయని వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



భువనగిరి రూరల్, ఏప్రిల్ 1: భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రి ప్రధాన గేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏరియా ఆస్పత్రి ఆవరణలో సుమారు 45 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఎండీ. సమీరొద్దీన్ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై నలుపు, తెలుపు రంగు గీతల టీ షర్ట్, బూడిద కలర్ పాయింట్ ఉంది. ఐదు రోజుల నుంచి ఆస్పత్రి సమీపంలో తిరుగుతున్నాడని, అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లాకేంద్ర ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 8712662471లో సంప్రదించాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ కోరారు.

ఇంట్లో చోరీ.. బంగారు ఆభరణాలు అపహరణ

ఆలేరు రూరల్, ఏప్రిల్ 1: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని బహదూర్‌పేటలోని ఓ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధమల్ల లత శనివారం సాయంత్రం జనగామ జిల్లా సింగరాజుపల్లిలోని తమ సమీప బంధువుల ఇంట్లో జరుగుతున్న వేడుకలకు వెళ్లింది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోని చొరబడ్డారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసుకోగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందజేశారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారంతో పాటు 25తులాల వెండి ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. ఈ విషయమై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై..

వలిగొండ, ఏప్రిల్ 1: మద్యానికి బానిసైన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వీరవెల్లి మదిరగ్రామం కమ్మగూడేనికి చెందిన సీహెచ్ లాజర్(50) వృత్తిరీత్యా వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై కుటుబ సభ్యులతో గొడవ పడి వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామ పరిధి 21/13-14 మైలు రాయి వద్ద గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్తున్న రైలుకు సోమవారం ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ సుధాకర్ నల్లగొండ రైల్వేస్టేషన్‌కు సమాచారం చేరవేశాడు. భువనగిరి రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని భువనగిరి మార్చురీకి తరలిస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. లాజర్‌కు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.

జవహర్ నవోదయ పరీక్ష ఫలితాలు విడుదల

పెద్దవూర, ఏప్రిల్ 1: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 6, 9వ తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో తాత్కాలికంగా ఎంపికైన 79మంది విద్యార్థుల వివరాలతోపాటు 9వ తరగతిలో ఎంపికైన ఏడుగురు విద్యార్థుల వివరాలు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ https://navodaya.gov.in/nvs/nvsschool/NALGONDA/en/home లోఅడ్మిషన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పూర్తిగా నింపి అవసరమైన అన్ని సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ నెల 11, 12వ తేదీల్లో డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం పాఠశాలకు రావాలని ఆయన సూచించారు.

బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరల పెంపు

- కెమెరా వినియోగిస్తే రూ.25, వీడియో కెమెరా రూ.10వేలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 1: అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రవేశ టికెట్ ధరలు ఈ నెల 1వ తేదీ నుంచి పెంచినట్లు బుద్ధవనం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ ధరలు పెద్దలకు రూ.100(గతంలో 50), 12సంవత్సరాలలోపు పిల్లలకు రూ.50(గతంలో రూ.30), విదేశీ పర్యాటకులకు రూ. 300లుగా నిర్ణయించారు. ఫోటో కెమెరాను ఉపయోగించినట్లయితే రూ. 25లు, ఒక రోజు వీడియో కెమెరాను వినియోగిస్తే రూ. 10వేలు, కాన్ఫరెన్స్ హాలుకు ఒకరోజుకు రూ. 10వేలుగా ధరలు నిర్ణయించారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఆయా విద్యాసంస్థల లెటర్ ప్యాడ్‌లను తీసుకువస్తే టికెట్ ధరలో 50శాతం రాయితీని కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మాంక్‌లు, బౌద్ధ భిక్షువులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారుల విచారణ

కోదాడ రూరల్, ఏప్రిల్ 1: సూర్యాపేట జిల్లా కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ప్రభుత్వం సరఫరా చేసే కుక్కకాటు, పాముకాటు మందులను కొందరు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని కొందరు ఇటీవల వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. ఆస్పత్రిలో పనిచేసే కొందరు సిబ్బంది ఖరీదైన మందులైన కుక్కకాటుకు సంబంధించిన రేబిస్ ఇంజెక్షన్, పాముకాటుకు సంబంధించిన ఇంజెక్షన్‌ను బయటి మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులు లేవని చెప్తున్నారని పలువురు రోగులు ఆరోపించారు. దీంతో ఆసుపత్రిలో వైద్యవిధాన పరిషత్ అధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథ్‌ను వివరణ కోరగా, ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్నిరకాల మందులు సరఫరా చేస్తున్నామని, కుక్క, పాముకాటుకు సంబంధించిన మందులు కూడా అందిస్తున్నామన్నారు. బయటి మార్కెట్‌లో మందులు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఈ విషయమై విచారణ జరిగిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు.

43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాపై భానుడి ప్రతాపం

నల్లగొండ, ఏప్రిల్ 1: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సూర్యప్రతాపంతో ప్రజలు విలవిలాడుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండలు పెరుగుతుండడంతో ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు జనం జంకుతున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో 43.0 డిగ్రీలు, చింతపల్లి మండలం గొడకండ్లలో 37.6 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో 42.2 డిగ్రీలు, తుంగతుర్తి మండ లంలో 36.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం మల్యాలలో గరిష్ఠంగా 42.2 డిగ్రీలు, వలి గొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో 37.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చండూరు ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీవో సుబ్రహ్మణ్యం

చండూరు, ఏప్రిల్ 1: చండూరు ఎంపీపీ పల్లె కల్యాణిపై సోమవారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. చండూరు ఎంపీడీవో కార్యాలయంలో బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీ పల్లె కల్యాణిపై సోమవారం అవిశ్వాస సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 11మంది ఎంపీటీసీలు ఉండగా, పుల్లెంల ఎంపీటీసీ మందడి నర్సింహారెడ్డి గతేడాది మృతి చెందారు. కాగా మిగిలిన ఎంపీపీతో కలిపి 10మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ఎంపీపీ పల్లె కల్యాణి మినహా 9మంది సభ్యులు హాజరయ్యారు. అవిశ్వాసానికి మద్దతుగా 9మంది ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తారు. ఇందులో ఆరుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు కాగా, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీగా ఉన్న అవ్వారు గీతకు ఇన్‌చార్జి ఎంపీపీగా అధికారులు బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ నెల 4వ తేదీన వైస్‌ఎంపీపీ గీత అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం జరగనున్నట్లు ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో సరోజ వెల్లడించారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి : వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

చిట్యాల, ఏప్రిల్ 1: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ కోరారు. చిట్యాలలో సోమవారం జరిగిన వ్యకాస జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వ్యకాస ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి జూన్ 1వ తేదీ వరకు సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించిందని, యంత్రాలతో పనిచేయిస్తూ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తుందని విమర్శించారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తారని అన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌లను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. వ్యవసాయ కార్మికులపై సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఉపాధి హామీ కార్మికులకు కేరళ మాదిరి రూ.600 రూపాయల వేతనం, రెండు వందల రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. వ్యకాస జిల్లా అధ్యక్షుడు చినవెంకులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, నాయకులు నారి అయిలయ్య, లింగస్వామి, రవినాయక్ పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి: ఏఐఎస్ఎఫ్

చండూరు, ఏప్రిల్ 1: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫీజును తక్షణమే తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. టెట్ పరీక్ష ఫీజును ఒక్కొక్క పేపర్‌కు రూ.200లు ఉన్న ఫీజును రూ.1000 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టారు. ఫీజులు లేకుండా పరీక్షలు నిర్వహిస్తామని, కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తక్షణమే టెట్ ఫీజులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇరిగి ప్రవీణ్, కురుపాటి పరమేష్, నల్ల మనోహర్, బరిగెల జనార్దన్, అభిలాష్, నిఖిల్ పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి, ఏప్రిల్ 1: మండలంలోని మొల్కపట్నం గ్రామంలో యాదవుల ఆరాధ్యదైవమైన గంగమ్మజాతరను వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి గంపలతో బయలుదేరిన యాదవులు సోమవారం ఉదయం రాశిబోనంతో పాటు జంతుబలి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవుల అభ్యున్నతికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, పెద్దగొల్ల బారి సైదులు, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, నాయకులు పాండు, నగేష్, ఆంజనేయులు, కిరణ్‌రెడ్డి, సురేందర్, వెంకన్న పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 1: వేసవికాలంలో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో కరుణాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయాశాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెడిపోయిన బోర్లు, మోటార్లను, లీకేజీకి గురైన పైపులైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఎండి.మోసిన్ బీన్ అహ్మద్, ఏఈ ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుంటే వాహనాల సీజ్

శాలిగౌరారం, ఏప్రిల్ 1: వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను యజమానులు దగ్గర పెట్టుకోవాలని నల్లగొండ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సాయిప్రసాద్ అన్నారు. శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనిఖీ సమయంలో ధ్రువపత్రాలు లేకుంటే ఫెనాల్టీ వేసి వాహనాలను స్వాధీనం చేసుకుకొని సీజ్ చేస్తామని హెచ్చరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. శాలిగౌరారం పరిసర ప్రాంతాల్లో ధ్రువీకరణ పత్రాలు లేకుండా తిరుగుతున్న 3 ట్రాక్టర్లు, ఒక డీసీఎంను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సాయి ప్రసాద్ తెలిపారు. ఆయన వెంట శాలిగౌరారం ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి రైతులు మద్దతు ధర పొందాలని పలువురు అధికారులు సూచించారు. జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని తేమ 17శాతం కంటే తక్కువగా ఉండేలా చూసుకోవడంతో పాటు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. రైతులు ధాన్యం కాంటాలు నిర్వహించే సమయానికి తమ ఆధార్‌కార్డు, బ్యాంకు, పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్‌లను నిర్వాహకులకు అందిస్తే సకాలంలో నగదును రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కేంద్రాల వద్ద రైతులకు అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.



వేములపల్లి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ నాగిరెడ్డి





కట్టంగూరు, శాలిగౌరారం మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో ప్రసాద్, లక్ష్మయ్య

● వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో మొత్తం 370 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.నాగమణి, ఏపీఎం ఎండి.నిజాముద్దీన్, సీసీ రమణయ్య, కమిటీ సభ్యులు సైదమ్మ, లూర్ధమ్మ, జానమ్మ, శ్రీలత, దివ్య, రైతులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు మండలంలోని తిరుమలరాయినిగూడెం, అడ్లూర్, మాదారం, ఉట్కూర్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో రేఖల లక్ష్మయ్య, మార్కెట్ కార్యదర్శి చీనా నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో నిమ్మల ఆంజనేయులు, ఏఈవో శ్రవణ్‌కుమార్‌రెడ్డి, తాల్లూరి మురళి పాల్గొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో బైరవునిబండ, గురజాల, రామాంజపురం గ్రామాల్లో ఎంపీఎం జానకి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

● కట్టంగూరు మండలంలోని అయిటిపాములు, కట్టంగూరు, బొల్లేపల్లి, చెరువుఅన్నారం, పరడలతో పాటు వివిధ గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, నకిరేకల్ క్లస్టర్ ఏఆర్ కె.సురేష్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, సీఈవో మల్లారెడ్డి, ఏపీఎం సైదులు, సీసీ శంకర్, స్వాతి, అంజమ్మ పాల్గొన్నారు.

●త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం అశోక్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు దేవ్‌సింగ్, హేమనాయక్, మురళి, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అనుముల మండలంలోని రామడుగు, మారేపల్లి, పులిమామిడి, శ్రీనాథపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను డీటీ రఘు ప్రారంభించారు. యాచారం, కొత్తపల్లి, మునిసిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో పీఏసీఎస్ కొత్తపల్లి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో రావుల సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, ఏపీఎం కళావతి, సీసీఎస్ చారి, సైదయ్య పాల్గొన్నారు.

● నిడమనూరు మండలంలోని ఊట్కూరు, రేగులగడ్డ, తుమ్మడం, ఇండ్లకోటయ్యగూడెం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ జంగాల కృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనారాయణ, మార్కెట్ కార్యదర్శి తోట చందర్‌రావు, కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ తరుణ్, సీఈవో జానయ్య, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండలంలోని ఆగామోత్కూర్, చిరుమర్తి, పాములపాడు, గ్యారకుంటపాలెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏపీఎం అనూక్ ప్రారంభించారు. ఆయన వెంట సీఆర్‌పీ నాగమణి, నాగయ్య ఉన్నారు.

● తిప్పర్తి మండలంలోని ఎర్రగడ్డలగూడెం, పజ్జూరు, తానేదార్‌పల్లి, అంతయ్యగూడెం, అనిశెట్టి దుప్పలపల్లి, రామలింగాలగూడెం, గోదారిగూడెం, మామిడాల గ్రామాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను ఏపీఎం శ్రీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సునీత, ఏ పీఎం సువర్ణ, డీటీ ఆబేదాబేగం, సీసీలు ఎమెలియా, జానకమ్మ, వీవోలు కవిత, జయమ్మ, రమణ, విజయ, పుష్ప, లక్ష్మి పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో జయరాం ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో డీపీఎం రామలింగయ్య, ఏపీఎం హరి, సీఆర్‌పీ జానకి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని కాసనగోడు, బొప్పారం, గుడివాడ గ్రామాల్లో సివిల్ సప్లయ్ డీటీ జ్యోతి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఐకేపీ ఏపీఎం యాదమ్మ, వ్యవసాయ శాఖ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని తాళ్లవెల్లంలలో తహసీల్దార్ కృష్ణ, వనిపాకలలో ఏపీఎం పద్మ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

● కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల, చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ సమీపంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీటీ శ్రీనివాస్‌గౌడ్, ఏవో వెంకన్న ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో పల్లా తిరుపతిరెడ్డి, ఆర్ఐ శ్యాంప్రసాద్‌రెడ్డి, పాపిరెడ్డి, నరేష్, హరి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఆర్వో శ్రీనివాసరావు

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 1: ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉన్నప్పుడే పారదర్శకంగా వ్యవహరించనున్నట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో సోమవారం పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీవో, ఏపీవోలు ఎన్నికల నియమనిబంధనలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎలక్షన్ విధులకు సంబంధించిన ఆర్డర్ కాపీని శిక్షణ కేంద్రంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించే దరఖాస్తుకు జతపర్చాలన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల విధులకు హాజరయ్యే పోలింగ్ అధికారులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించి, పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్‌ఆఫీసర్ బాలాజీనాయక్, శిక్షకులు గుడిపాటి కోటయ్య, బాలు, జవహర్‌లాల్, ఎను, రామచంద్రు, జనారన్, గోవర్ధన్, సైదులు, వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత : రాజగోపాల్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరురూరల్, ఏప్రిల్ 1: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు మండలం కోటయ్యగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం సీతారాముల నూతన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహమూర్తులను వేదమంత్రాల నడుమ ఎంతో అంగరంగ వైభవంగా ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆలయ సందర్శనతో మానసిక ఒత్తిడి పూర్తిగా తొలిగిపోతుందని సూచించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చండూరు మునిసిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, నాయకులు కావలి ఆంజనేయులు, మేకల వెంకన్న, గంట సత్యం, సత్తయ్య, రాంబాబు, యాదయ్య, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 1: ఉద్యోగికి పదవీ విరమణ సహజమని పలువరు పేర్కొన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయురాలు కలమ్మ పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, డాక్టర్ కృష్ణకౌండిన్య, కె.లక్ష్మణ్, పల్లా వెంకట్‌రెడ్డి, శ్రీనయ్య, కొర్ర లోక్యనాయక్, జగదీష్, నర్సింహ, వెంకటేశ్వర్లు, ఎబినేజర్, శ్రీపతిరావు, అక్కిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సూర్య, సీతారాం, లక్ష్మయ్య, సైదానాయక్, నీరజ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



కలమ్మ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవికి చినరామయ్య రాజీనామా



చినరామయ్య

మిర్యాలగూడఅర్బన్, ఏప్రిల్ 1: అడవిదేవులపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కురాకుల చినరామయ్య ఆ పార్టీ సభ్యత్వానికి, అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం పట్టణంలోని హనుమాన్‌పేటలో తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 సంవత్సరాలు గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి కుందూరు జానారెడ్డితో తనకున్న సాన్నిహిత్యంతో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపునకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న పలువురు ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు చినరామయ్య తెలిపారు. ఆయన వెంట సైదయ్య, చెన్నకేశవులు ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో రాంమోహన్‌రావు

డిండి, ఏప్రిల్ 1: డిండి గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారనే ఫిర్యాదుల మేరకు డీఎల్‌పీవో ఎంవి.రాంమోహన్‌రావు సోమవారం విచారణ చేపట్టారు. డిండి గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్ మేకల సాయమ్మ దుర్వినియోగం చేసినట్లు లోకాయుక్తలో గ్రామ ఉపసర్పంచ్ నూకం వెంకటేష్ 4/1/2024వ తేదీన ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు డీఎల్‌పీవో గ్రామపంచాయతీ అధికారి, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బందిని విచారణ చేశారు. 2019లో పీఎఫ్ఎంఎస్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1లక్ష 41వేల 836, పీఎఫ్ఎంఎస్ నిధులు రూ.1లక్ష 41వేల 836 15/12/2023న, 15/12/2023న రూ.40 వేలు తన సంతకాన్ని ఫోర్జరీ చేసి అక్రమంగా డ్రా చేశాడని లోకాయుక్తకు అందజేసిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన డీఎల్‌పీవో రాంమోహన్‌రావు తన సమగ్ర నివేదికను 10 రోజుల్లో జిల్లా పంచాయతీ అధికారికి అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు జంగయ్య, సతీష్‌చంద్ర, ఎస్‌కె.ఖాజా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు చదువుపై దృష్టి సారించాలి

నల్లగొండ స్పోర్ట్స్, ఏప్రిల్ 1: క్రీడాకారులు ఆటలతో పాటు చదువుపై కూడా దృష్టి సారిస్తే చిన్న వయస్సులోనే స్థిరపడవచ్చని ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ టెక్నికల్ కమిటీ సభ్యుడు, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీపీ ఫల్గుణ అన్నారు. స్పోర్ట్స్ కోటాలో పోలీస్‌శాఖలో ఉద్యోగం సాధించిన ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్ సభ్యుడు, ఫుట్‌బాల్ క్రీడాకారుడు బొమ్మపాల సాయిచంద్ర, సిద్ధార్థ్‌ను ఆయన అభినందించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో టీఎస్ఎస్పీ విభాగంలో శిక్షణ కోసం రిపోర్టు చేసిన సందర్భంగా ఫల్గుణను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే కాకుండా ఉద్యోగాలను సాధిస్తారని అన్నారు. దానికి సిద్ధార్థ్ ఒక నిదర్శమని పేర్కొన్నారు.

విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

హాలియా, ఏప్రిల్ 1: ప్రతి ఒక్క విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అనుముల ఎంఈవో బాలునాయక్ అన్నారు. హాలియాలోని లక్ష్య పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ తదితర అంశాల్లో సోమవారం ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ప్రత్యేక తరగతుల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులు, తల్లితండ్రులకు ట్రంప్ అనే కార్యక్రమం ద్వారా సన్మానించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ చదువుతోనే ఏదైనా సాధించగలమని, అన్నింటికీ చదువే మూలమన్నారు. ప్రతీ విద్యార్థి అందరికీ స్పూర్తిదాయకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్.సతీష్, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో కేంద్ర బలగాల కవాతు



కేతేపల్లిలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

కేతేపల్లి, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఐటీబీపీ కేంద్ర బలగాలు మండలకేంద్రం కేతేపల్లిలో సోమవారం కవాతు నిర్వహించాయి. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీస్‌బృందం మార్చ్ పాస్ట్ నిర్వహించింది. కార్యక్రమంలో ఐటీబీపీ కమాండెంట్ ఈ శ్వర్‌సింగ్, ఎస్ఐ శివతేజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

పెద్దఅడిశరపల్లి: పీఏపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని 31 గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలన్నారు.

మిర్యాలగూడ టౌన్: క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. బెట్టింగ్ విష సంస్కృతి విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరారు. మహానగరాలు, పట్టణాలకు పాకిన బెట్టింగ్ వ్యసనం పల్లెలకూ విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెట్టింగులతో యువత జీవితాలు ఆగమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

దేవరకొండ: దేవరకొండలో సీఐ నర్సింహులు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. ఉప్పువాగు, డిండి రోడ్డు, కల్వకుర్తి రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు తీసుకువస్తే పత్రాలు చూపించాలని సీఐ తెలిపారు. రూ.50 వేలకు మించి అనుమతిలేదని అన్నారు.

చండూరు: చండూరు మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన వెంచర్లలో సుమారు రూ.2కోట్లు విలువ చేసే 10శాతం ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వాటిని రద్దు చేయాలని కోరుతూ రైతుసేవా సహకార సంఘం డైరెక్టర్ కట్ట బిక్షం ఆరో పించారు. సోమవారం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యంలకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ఆధారాతో నివేదిక సమర్పించాలని ఎంపీడీవో, తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌కు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

కేతేపల్లి: బీజేపీతోనే దేశానికి భద్రత ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అన్నారు. కేతేపల్లిలో పలువురు పార్టీ నాయకులతో కలిసి భువనగిరి ఎంపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్ గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనితాగౌడ్, రోషయ్య, నర్సింహాచారి, శ్రీనివాసగౌడ్, విజయలక్ష్మి, వెంకట్ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రావు

నల్లగొండ: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా జిల్లా కేంద్రానికి చెందిన బీపంగి జగ్జీవన్‌రావు నియమితులయ్యారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీపంగి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

దేవరకొండ: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా దేవరకొండకు చెందిన పోలగోని గణేష్ నియమితులయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు వంగూరి రాఖీ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ జిల్లాలో యువమోర్చా బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

కొండమల్లేపల్లి: బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శిగా భూతరాజు భరత్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మర్రిగూడ: ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటు కోసం మాజీ ఎంపీటీసీ రమావత్ బీమానాయక్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. మండలంలోని రాజుపేటతండా పరిధిలోని పద్మశాలీ కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం కోసం విరాళం అందజేసినట్లు పద్మశాలీ కాలనీ ఆంజనేయ స్వామి కమిటీ అధ్యక్షుడు సీహెచ్. ఈశ్వర్, జయప్రకాశ్ తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

నల్లగొండ, నల్లగొండటౌన్, ఏప్రిల్ 1: రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అభ్యర్థిని గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ ఎం సీ కోటిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిషోర్, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు రెగట్టె మల్లికార్జున్‌రెడ్డి, పల్లె రవి, చీర పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, చకిలం అనిల్‌కుమార్, చెరుకు సుధాకర్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, లొడంగి గోవర్ధన్‌యాదవ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.